క్లుప్తంగా

చట్టాలపై అవగాహన ఉండాలి

తిరుపతి అర్బన్: చట్టాలపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని ఈస్ట్ దిశ ఏఎస్ఐ రోహిణి తెలిపారు. తిరుపతిలోని మున్సిపల్ అప్పర్ ప్రైమరీ స్కూల్‌లో సోమవారం విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ దిశా చట్టాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. రైల్వే చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ బాలాజీ మాట్లాడుతూ పిల్లల రక్షణకు సహకరించాలని కోరారు. 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ ద్వారా పిల్లల రక్షణకు చర్యలు తీసుకుంటామన్నారు. నాగమణి, పోలీసులు విజిత, నాగరత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

రేపు తిరుపతి రూరల్ మండల సమావేశం

తిరుపతి రూరల్: మండల ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో వెంకటనారాయణ తెలిపారు. తిరుపతి రూరల్ ఎంపీపీ, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశంలో ముఖ్య అతిథులుగా చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్సీలు పాల్గొంటారని తెలిపారు. మండలంలోని జెడ్పీటీసీ, సర్పంచులు, ఎంపీటీసీలు, అధికారులు పాల్గొనాలని కోరారు.

8 మంది పేకాట రాయుళ్ల అరెస్ట్

తిరుపతి క్రైం: ఈస్ట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని చార్మినార్ లాడ్జిలో 8 మంది పేకాటరాయుళ్లను ఎస్ఐ నాగేంద్రబాబు సోమవారం అరెస్ట్ చేశారు. తిరుపతిలో నివాసం ఉంటున్న శివనాగిరెడ్డి, వెంకటేశ్వర్లు, నాగేశ్వర్ రెడ్డి, అభిరెడ్డి, మునిరెడ్డి, వెంగన్న మునిరెడ్డి, దేవేందర్ రెడ్డి, శివ శంకర్ రెడ్డి పేకాట ఆడుతున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. తమ సిబ్బందితో దాడులు నిర్వహించగా రూ.52,500 నగదు స్వాధీనం చేసుకుని ఎనిమిది మంది నిందితులను అరెస్ట్ చేశామన్నారు. లాడ్జ్ యజమానిని కూడా అదుపులోకి తీసుకుంటామన్నారు.

ఆకట్టుకుంటున్న గ్రేట్ బాంబే సర్కస్



తిరుపతి కల్చరల్: ఆసియాలోనే అతి పెద్ద సర్కస్ కంపెనీ గ్రేట్ బాంబే సర్కస్ ఆధ్వర్యంలో డీబీఆర్ రోడ్డులోని యాలమూరి పార్కులో ఏర్పాటు చేసిన గ్రేట్ బాంబే సర్కస్ ప్రజలకు విశేషంగా ఆకట్టుకుంటోంది. నిర్వాహకులు సంజీవ్, ఇలియాజ్ ఖాన్, రమేష్ మాట్లాడుతూ వందేళ్లుగా దేశవ్యాప్తంగా అనే ప్రాంతాల్లో సర్కస్‌ను ప్రదర్శిస్తూ వింత వింత ఫీట్లు చేస్తూ ప్రజాదరణ పొందుతున్నామన్నారు. ప్రస్తుతం తిరుపతిలో సర్కస్‌లో సైక్లింగ్, స్కై వాక్, జిమ్నాస్టిక్స్, సోమర్‌సాల్ట్, రోప్ వాకర్స్, ఫైర్ ఈటర్స్, స్వివర్స్, హూవర్స్, ట్రాపెజిస్ట్, డ్యాన్సర్లు, రష్యన్, ఆఫ్రికన్ కళాకారులు, పులులు, సింహాలు, గజరాజులను ఆడించే రింగ్ మాస్టర్లతో పలు ఫీట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి రోజూ మధ్యాహ్నం ఒంటిగంటకు, సాయంత్రం 4, రాత్రి 7 గంటలకు మూడు షోలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా మాతమ్మ కొలుపు

కార్వేటినగరం: మండలంలోని బంద్రేవు కాలనీలో సోమవారం మాతమ్మ కొలుపను వైభవంగా ప్రారంభించారు. అమ్మవారిని వేకువజామున సుప్రభాతంతో మెల్కొలిపి ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. రాత్రి అమ్మవారిని ప్రత్యేక వాహనంపై ప్రతిష్ఠించి ఊరేగించారు. ఎంపీపీ లత, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మేజర్ పంచాయతీ కార్వేటినగరం సర్పంచ్ ధనుంజయ వర్మ అమ్మవారిని దర్శించుకున్నారు.






వినాయక చవితికి విగ్రహాలు సిద్ధం

వినాయక చవితి పండుగకు విగ్రహాలు సిద్ధమవుతున్నాయి. మంగళం బొమ్మల క్వార్టర్స్‌లో కళాకారులు మూడు ఇంచుల నుంచి 30 అడుగుల ఎత్తుగల విగ్రహాలను తీర్చిదిద్దుతున్నారు. ఒక్కో విగ్రహం రూ.30 నుంచి రూ.2 లక్షల వరకు విక్రయించనున్నట్లు వారు చెబుతున్నారు. ఇక్కడ తయారయ్యే విగ్రహాలు కడప, కర్నూలు, నెల్లూరు జిల్లాలతో పాటు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు తరలిస్తామని వెల్లడించారు.

\- సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

తిరుపతిలో నేటి నుంచి మొబైల్ ఆధార్ క్యాంపులు

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో మంగళవారం నుంచి 25వ తేదీ వరకు మొబైల్ ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్టు తిరుపతి నగర పాలక సంస్థ కమిషనర్ హరిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా ఆధార్ కార్డు నమోదు, 5, 15 ఏళ్లు దాటిన బాల, బాలికలకు బయోమెట్రిక్ అప్‌డేట్ సేవలు పూర్తిగా ఉచితంగా పొందవచ్చని తెలిపారు. తిరుపతి ప్రజలు ఆధార్ కార్డులోని చిరునామాలో తిరుపతి జిల్లాగా మార్చుకోవచ్చని వెల్లడించారు. ఇతర వివరాలకు వార్డు సచివాలయాన్ని లేదా వలంటీర్‌ను సంప్రదించాలని సూచించారు.

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని సోమవారం ఏపీ ఎమ్మెల్యే అవంతి శ్రీనివాస్, తెలంగాణ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, ఏపీ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ గోపీనాథ్, ఎస్వీబీసీ మాజీ సీఈవో శర్మ దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధి కారులు లడ్డు, ప్రసాదాలతో సత్కరించారు.

బీసీల సమస్యలపై ఎంపీ గురుమూర్తికి వినతి



తిరుపతి కల్చరల్: బీసీల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.క్రిష్ణయ్య తనయుడు, సంఘం గౌరవ అధ్యక్షుడు ఆర్.అరుణ్‌కుమార్ కోరారు. ఆయన సోమవారం తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తిని తిరుపతిలో కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై ఎంపీతో చర్చించారు. ఎంపీని కలిసిన వారిలో జాతీయ యువజన సంఘం జాతీయ కార్యదర్శి శివకుమార్ కూడా ఉన్నారు.

టీటీడీపై దుష్ప్రచారం చేస్తే చూస్తూ ఊరుకోం

తిరుపతి కల్చరల్: ప్రపంచ ప్రసిద్ధిగాంచిన ధార్మిక సంస్థ టీటీడీపైనా, టీటీడీ యాజమాన్యంపైనా తమ స్వార్థ రాజకీయ లబ్ధికోసం కొందరు పనిగట్టుకొని చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు టీటీడీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చీర్ల కిరణ్ తెలిపారు. ఆయన సోమవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. గతంలో టీటీడీ చైర్మన్‌గా భూమన అనేక సంస్కరణలు తీసుకువచ్చి టీటీడీ ప్రతిష్టతను ఇమిడింపజేశారని తెలిపారు. అలాంటి వ్యక్తిని క్రిస్టియన్ సామాజిక వర్గానికి చెందిన వారని ముద్ర వేస్తూ సోషల్ మీడియా వేదికగా అబద్ధపు ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. టీటీడీ చైర్మన్‌గా వైవీ. సుబ్బారెడ్డి బాధ్యతలు చేపట్టినప్పుడూ ఇదే ఆరోపణలు చేశారని గుర్తు చేశారు. ఇటీవల తిరుమల నడక దారిలో పులి దాడి నేపథ్యంలో భక్తులకు కర్రలు ఇవ్వాలని తీసుకున్న నిర్ణయంపైనా దుష్ప్రచారం సాగించడం విడ్డూరమన్నారు. ఇప్పటికైనా రాజకీయ లబ్ధికోసం చేసే తప్పుడు ప్రచారాన్ని మానుకోవాలన్నారు. లేని పక్షంలో విమర్శకుల ఇళ్ల వద్ద ఉద్యోగులందరూ కలిసి నిరసనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ పవన్, ప్రధాన కార్యదర్శి శ్రీహరి, కోశాధికారి శివ, సునీల్, జిల్లా శివ, మణికంఠ, మహిళా అధ్యక్షురాలు హేమలత, రుక్మిణి, అనురాధ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీటీడీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు చీర్ల కిరణ్

టీటీడీ చైర్మన్, ఈవోలపై విమర్శలు విడ్డూరం

ధార్మిక సంస్థ టీటీడీ, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ధర్మారెడ్డిపై అసత్య ప్రచారం చేయడం విడ్డూరమని టీటీడీ పద్మావతి ఉమెన్స్ అసోసియేషన్ అధ్యక్షురాలు హేమలత తెలిపారు. ఆమె సోమవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. సనాతన హైందవ ధర్మప్రచారమే లక్ష్యంగా టీటీడీ నిరంతర కార్యక్రమాలు చేపడుతోందన్నారు. టీటీడీ లక్ష్యాలను మరింత విస్తృతం చేస్తూ శ్రీవారి వైభవాన్ని విశ్వవ్యాప్తం చేసే దిశగా అధికారులు సైతం సనాతన ధర్మాన్ని అనుసరిస్తూ సేవలు అందించడం ఆనవాయితీ అన్నారు. కొంతమంది టీటీడీ ధార్మిక సంస్థను తమ స్వార్థం కోసం రాజకీయ వేదికగా చేసుకుంటూ అసత్య ప్రచారం చేయడం సమంజసం కాదన్నారు. శ్రీపద్మావతి ఉమెన్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అనూరాధ, సంయుక్త కార్యదర్శి రుక్మిణి పాల్గొన్నారు.

ఓటరుగా నమోదు చేసుకోండి

తిరుపతి తుడా : 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని తిరుపతి ఓటరు నమోదు అధికారి హరిత తెలిపారు. ఆమె సోమవారం ఓటరు జాబితాపై ఉపాధ్యాయ నగర్ అన్నమయ్య మార్గ్ జీవకోన ప్రాంతాల్లో చేపట్టిన క్షేత్రస్థాయి సర్వేను తనిఖీ చేశారు. తప్పులు లేని ఓటర్ జాబితాను సిద్ధం చేయాలని బీఎల్వోలకు సూచించారు. మృతి చెందిన, వలస వెళ్లిన, పెళ్లి అయి వేరే ప్రాంతాలకు వెళ్లిన వారి పేర్లను జాబితా నుంచి తొలగించాలన్నారు. అర్బన్ తహసీల్దార్ వెంకటరమణ, డిప్యూటీ తహసీల్దార్ జీవన్, నాయక్ పాల్గొన్నారు.



ఓటరు జాబితా సర్వేను తనిఖీ చేస్తున్న ఓటరు నమోదు అధికారి హరిత

గంగమ్మను దర్శించుకున్న హాస్యనటుడు గౌతమ్‌రాజు



గౌతమ్‌రాజుకు అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేస్తున్న అర్చకులు

తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట గంగమ్మను సోమవారం సినీ హాస్యనటుడు గౌతమ్‌రాజు కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం తీర్థప్రసాదాలు అందజేశారు. గౌతమ్‌రాజుతో సెల్ఫీలు దిగేందుకు భక్తులు పోటీ పడ్డారు.

రాజ అనిరుద్ శ్రీరామ్‌కు కలెక్టర్ అభినందనలు



తిరుపతి అర్బన్: జాతీయ, అంతర్జాతీయ స్థాయి ఒలింపియాడ్ పోటీల్లో ప్రతిభ చూపుతున్న రాజ అనిరుద్ శ్రీరామ్(8)ను కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి అభినందించారు. రాజ అనిరుద్ శ్రీరామ్ సోమవారం తండ్రి సాకేత్ రామ్, తల్లి అంజనా శ్రావణితో కలిసి కలెక్టర్‌ను కలిశాడు. విద్యార్థి ప్రస్తుతం తిరుపతిలోని ఎడిఫై స్కూల్‌లో 4వ తరగతి చదువుతున్నాడు. గత జూలై 23వ తేదీన సింగపూర్‌లో జరిగిన ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్ ఛాలెంజ్‌లో పాల్గొన్నాడు. 2000 మంది విద్యార్థులతో పోటీపడి రాజఅనిరుద్ శ్రీరామ్ రజత పతకాన్ని సాధించాడు.

రష్‌లో వృద్ధులకు ఉచిత కన్సల్టేషన్ వైద్య శిబిరం



సీనియర్ సిటిజన్స్ దినోత్సవం సందర్భంగా కేక్ కట్ చేస్తున్న డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం

తిరుపతి కల్చరల్: అంతర్జాతీయ సీనియర్ సిటిజన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం రష్ మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో వృద్ధులకు ఉచిత కన్సల్టేషన్ వైద్య శిబిరం ప్రారంభించారు. రష్ హాస్పిటల్ అధినేత, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ వృద్ధాప్యంలో ప్రోస్టేట్ వాపు, హెర్నియా, హైడ్రోసిల్ వంటి వ్యాధులతో బాధపడుతున్నారని తెలిపారు. సరైన ఆర్థిక స్థోమత లేక వృద్ధులు వైద్యం చేయించుకునేందుకు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. బాధితులకు ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ పథకాల కింద ఉచిత శస్త్ర చికిత్స చేయనున్నట్లు తెలిపారు. సీనియర్ సిటిజన్స్‌కి వచ్చే ఆరోగ్య సమస్యలైన ప్రోస్టేట్ వాపు, హెర్నియా, హైడ్రోసిల్ తదితర సమస్యలకు సోమవారం నుంచి సెప్టెంబర్ 5వ తేదీ వరకు ఉచిత కన్సల్టేషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సోము టెక్స్‌టైల్స్ అండ్ రెడీమేడ్స్ షోరూం ప్రారంభం



సోము టెక్స్‌టైల్స్ అండ్ రెడీమేడ్ షోరూంను ప్రారంభిస్తున్న అతిథులు

తిరుపతి కల్చరల్: తిరుపతి నగరం కొత్తవీధిలో ఏర్పాటు చేసిన సోము టెక్స్‌టైల్స్ అండ్ రెడీమేడ్స్ షోరూంను సోమవారం ప్రముఖ డాక్టర్ మునిశేఖర్ ఘనంగా ప్రారంభించారు. షోరూం అధినేత కె.సోమశేఖర్‌బాబు మాట్లాడుతూ తమ వద్ద ప్రముఖ బ్రాండెడ్ సంస్థలైన లీనెన్ క్లబ్, రైమాండ్స్, అరవింద్‌తో పాటు అన్ని రకాల రెడీమేడ్ వస్త్రాలు లభిస్తాయన్నారు. షోరూం ప్రారంభం సందర్భంగా రూ.5 వేల విలువైన వస్త్రాల కొనుగోలుపై క్యూపన్లు ఇస్తున్నామని, దీపావళి రోజు లక్కీడిప్ ద్వారా విజేతలకు ఎంపిక చేసి ఎలక్ట్రికల్ స్కూటర్, ఏసీ, ఎల్ఐడి టీవీలను బహుమతిగా ఇస్తామన్నారు. కార్యక్రమానికి ఎంపీ మిథున్‌రెడ్డి తమ్ముడు సుధీర్‌రెడ్డి నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు. షోరూం ప్రతినిధి వెంకటేష్ పాల్గొన్నారు.

ప్రజా రవాణాకు ఇబ్బంది కలిగించే వారిపై చర్యలు



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ హరిత

తిరుపతి తుడా: తిరుపతి నగరంలో ప్రజా రవాణాకు ఆటంకం కలిగించే వారిపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.హరిత అధికారులను ఆదేశించారు. ఆమె సోమవారం డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణతో కలిసి స్పందన, డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమం నిర్వహించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం అధికారులతో సమీక్షించారు. నాగమ్మ హాస్పిటల్ రోడ్డులోని ప్రతిభ ప్లే హోమ్ స్కూల్ యాజమాన్యం భారీ గేట్లు ఏర్పాటు చేయడంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉందన్న ఫిర్యాదుపై కమిషనర్ స్పందించారు. వెంటనే వాటిని తొలగించాలని టౌన్ ప్లానింగ్ అధికారులకు సూచించారు. ఇష్టారాజ్యంగా రోడ్లపై వాహనాలను పార్కింగ్ చేసినా, దుకాణాల ముందు నో పార్కింగ్ బోర్డులు, భారీ గేట్లు ఏర్పాటు చేసుకున్నా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అదనపు కమిషనర్ సునీత, డిప్యూటీ కమిషనర్ చంద్రమౌళీశ్వర రెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువఅన్వేష్, డీసీపీ శ్రీనివాసులు రెడ్డి, మున్సిపల్ ఇంజినీర్లు చంద్రశేఖర్, వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తి పారవశ్యాన్ని నింపిన త్యాగరాజ సంగీతోత్సవాలు

తిరుపతి కల్చరల్: త్యాగరాజ మండపంలో సోమవారం ప్రదర్శించిన సంగీత కచేరీలు ఆహూతుల్లో భక్తి పారవశ్యాన్ని నింపాయి. త్యాగరాజ మండపంలో త్యాగరాజ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంగీతోత్సవాలు సోమవారానికి నాలుగో రోజుకు చేరాయి. సంగీత విద్యాంసుడు ఓఎస్ అరుణ్ బృందం సంగీత గానాలాపన వీనుల విందు చేసింది. వీరికి వయోలిన్‌పై వీవీ.శ్రీనివాస రావు, మృదంగంపై నైవేలి స్కంధ సుబ్రమణ్యం సహకరించారు. అనంతరం సంగీత కళానిధి లాల్‌గుడి జీజేఆర్.క్రిష్ణన్ ఆలపించిన త్యాగరాజ సంకీర్తనలు ఆకట్టుకున్నాయి. ఆయనకు వయోలిన్‌పై సంగీత కళానిధి విజయలక్ష్మి, మృదంగంపై అరవింద్ రంగనాథన్, కంజీరపై ఆలత్తూర్ రాజగణేష్ సహకారం అందించారు. కళాబృందాలను నిర్వాహకులు మోహన్ సుందరం, కంచి రఘురామ్, ప్రభాకర్ సత్కరించారు.



సంకీర్తనలు ఆలపిస్తున్న సంగీత కళానిధి లాల్‌గుడి జీజేఆర్.క్రిష్ణన్

బహిరంగ ప్రకటన

[illegible]

బి.మధుసూదన్‌రెడ్డి, అడ్వకేట్
డి.నెం.18-4-75, 2వ అంతస్థు, రైల్వే కాలనీ,
తిరుపతి-517501. సెల్: 9440934263.






పాస్‌పోర్టు కష్టాలు

తిరుపతి నగరంలోని ప్రాంతీయ పాస్‌పోర్టు కార్యాలయానికి కడప, అనంతపురం, చిత్తూరు, నెల్లూరు నుంచి నిత్యం వేలాది మంది ప్రజలు పాస్‌పోర్టుల కోసం వస్తుంటారు. ఇక్కడ కనీస వసతులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా మహిళలు చంటి బిడ్డలతో వచ్చి కార్యాలయం ఎదుట ఫుట్‌పాత్‌పై ఎండలో వేచివుండాల్సి వస్తోంది. అధికారులు స్పందించి కార్యాలయం వద్ద ప్రజలు వేచి ఉండడానికి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

\- సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి

రోడ్డుపై ఎండలో వేచి ఉన్న పాస్‌పోర్ట్ కోసం వచ్చిన వారు

